నమస్తే తెలంగాణ
జనగామ
5 | ఆదివారం 24 డిసెంబర్ 2023 | JANAGAON

1 నుంచి కాకతీయ కాల్వకు నీటి విడుదల

- ఏర్పాట్లు చేసిన అధికారులు
- ఆరుతడి పంటలకు వాడుకోవాలి
- ఎస్సారెస్పీ ఈఎన్‌సీ శంకర్

హనుమకొండ సబర్బన్, డిసెంబర్ 23 : యాసంగి పంటలకు సంబంధించి కాకతీయ కాల్వకు జనవరి 1న సాగునీటిని విడుదల చేయనున్నారు. ఈ మేరకు నీటి పారుదల శాఖ అధికారులు అన్ని ఏర్పాట్లను పరిశీలించారు. ప్రతి ఏడాది మాదిరిగానే ఈ సారి కూడా వారబందీ పద్ధతిలో ఆన్ అండ్ ఆఫ్ సిస్టమ్‌లోనే నీటిని విడుదల చేయనున్నారు. ప్రస్తుతం కరీంనగర్‌లోని లోయర్ మానేర్ డ్యాం (ఎల్ఎండీ) లో 19.53టీఎంసీల నీరు నిల్వ ఉంది. ఇందులో నుంచి 7టీఎంసీలను సాగునీటి అవసరాలకు వినియోగిస్తారు. మిగతా నీటిని కరీంనగర్, వరంగల్, హనుమకొండ, మహబూబాబాద్, భూపాలపల్లి, సూర్యాపేట జిల్లాల వరకు తరలిస్తారు. మిడ్ మానేరులో సైతం 23.06టీఎంసీల నీరు నిల్వ ఉంది. శ్రీరాంసాగర్ ప్రాజెక్ట్‌లో సైతం పుష్కలంగా నీరు ఉంది. యాసంగి పంటలకు సరిపడా నీరు అందుబాటులో ఉన్నట్లు అధికారులు చెబుతున్నారు. అయితే రైతులు సాధ్యమైనంత వరకు ఆరుతడి పంటలకే మొగ్గు చూపాలని ఎల్ఎండీ ఈఎస్‌సీ శంకర్ పేర్కొన్నారు.

హనుమకొండ టీఎన్‌జీవోస్‌కాలనీలోని వేంకటేశ్వరస్వామి ఆలయం వద్ద బారులు తీరిన భక్తులు

ముక్కోటి మొక్కులు

ముక్కోటి ఏకాదశి పర్వదిన వేడుకలు ఉమ్మడి వరంగల్ జిల్లావ్యాప్తంగా శనివారం ఘనంగా సాగాయి. ఈ రోజు ఉత్తర ద్వారం గుండా విష్ణుమూర్తిని దర్శిస్తే సమస్త పుణ్యం దక్కుతుందని భక్తుల విశ్వాసం. దీంతో ఉదయం నుంచే వైష్ణవ ఆలయాలకు భక్తులు పోటెత్తారు. వరంగల్‌లోని గిర్మాజీపేట గోవిందరాజుల ఆలయం, బట్టలబజార్‌లోని శ్రీబాలానగర్ వేంకటేశ్వరాలయం, హనుమకొండ జిల్లాలోని వైష్ణవ ఆలయాలు, జనగామ జిల్లాలోని వల్మిడి సీతారామచంద్రస్వామి ఆలయం, చిల్పూరులోని బుగులు వేంకటేశ్వరస్వామి ఆలయం, భూపాలపల్లి జిల్లాకేంద్రంలోని వేంకటేశ్వరస్వామి ఆలయం కాళేశ్వరం, ములుగు జిల్లా మంగపేట మండలం మల్లూరులోని హేమాచల లక్ష్మీనరసింహస్వామి ఆలయం, మహబూబాబాద్ జిల్లాకేంద్రంలోని వేణుగోపాలస్వామి ఆలయాలు భక్తులతో కిటకిటలాయి. నారాయణుడి నామస్మరణతో మార్మోగాయి. - నమస్తే తెలంగాణ, నెట్‌వర్క్

ఉమ్మడి వరంగల్ జిల్లాలో ఈ ఏడాది ప్రధాన పంటలైన పత్తి, వరి, మక్కజొన్న సాగు విస్తీర్ణం గణనీయంగా తగ్గింది. ముఖ్యంగా పత్తి సాధారణ విస్తీర్ణంలో కూడా సాగు కాలేదు. గతేడాది 6,37,133 ఎకరాల్లో పత్తి సాగు చేయగా, ఈ సంవత్సరం వానకాలంలో 5,26,727 ఎకరాల్లో మాత్రమే సాగైంది. అలాగే వరి గతేడాది 9,12,227 ఎకరాల నుంచి 9,00,215 ఎకరాలకు, మక్కజొన్న 75,336 ఎకరాల నుంచి 64,768 ఎకరాలకు తగ్గిపోయింది. గతేడాదితో పోల్చితే వరి 12వేల ఎకరాల విస్తీర్ణం తగ్గినప్పటికీ సాధారణ విస్తీర్ణం దాటింది. కాగా పత్తి 4,21,382 టన్నులు, వరి 18,00,430 టన్నులు, మక్కజొన్న 95,856 టన్నుల దిగుబడి రానుందని వ్యవసాయ అధికారులు అంచనా వేశారు.

- వరంగల్, డిసెంబర్ 23 (నమస్తే తెలంగాణ)

మక్కజొన్న చేను

పత్తి పంట

పంటల సాగు తగ్గింది..

- సాధారణం కంటే తక్కువ విస్తీర్ణంలో పత్తి సాగుచేసిన రైతులు
- పత్తి 5,26,727.. వరి 9,00,215, మక్కజొన్న 64,768 ఎకరాల్లో సాగు
- పత్తి దిగుబడులు 4,21,382 టన్నులు వచ్చే అవకాశం ఉందని అంచనా
- 18,00,430 టన్నుల ధాన్యం, 95,856 టన్నుల మక్కజొన్న దిగుబడులకు ఎస్టిమేట్

ఉమ్మడి జిల్లాలో గతేడాది కంటే ఈసారి గణనీయంగా తగ్గిన వానకాలం విస్తీర్ణం

ఉమ్మడి వరంగల్ జిల్లాలో పత్తి పంట సాధారణ విస్తీర్ణం 6,37,759 ఎకరాలు. పత్తి సాగులో జనగామ జిల్లా ప్రథమ స్థానంలో ఉంది. ఆ తర్వాత వరంగల్ జిల్లా రెండో స్థానంలో నిలిచింది. జిల్లాలవారీగా వరంగల్ 1,30,908, హనుమకొండ 1,08,944, మహబూబాబాద్ 94,193, ములుగు 27,148, జయశంకర్ భూపాలపల్లి 1,14,891, జనగామ 1,61,675 ఎకరాలుగా ఉంది. గతేడాది వానకాలం ఉమ్మడి జిల్లాలో పత్తి పంట సాగు విస్తీర్ణం దాదాపు సాధారణానికి చేరింది. ఆరు జిల్లాల్లోని రైతులు 6,37,133 ఎకరాల్లో పత్తి పంట సాగుచేశారు. ఇందులో జిల్లాలో వరంగల్ 1,28,605, హనుమకొండ 83,778, మహబూబాబాద్ 1,25,570, ములుగు 25,718, భూపాలపల్లి 1,08,462, జనగామ 1,65,000 ఎకరాలు ఉన్నట్లు అధికారులు ప్రభుత్వానికి పంపిన నివేదికలో పేర్కొన్నారు. గతేడాది జనగామ జిల్లాలో మాత్రమే సాధారణం కంటే ఎక్కువ విస్తీర్ణంలో రైతులు పత్తి సాగు చేయడం గమనార్హం. ఈ ఏడాది వానకాలం ఏ ఒక జిల్లాలోనూ పత్తి పంట సాగు విస్తీర్ణం సాధారణం కంటే దాటలేదు. జిల్లావారీగా రైతులు వరంగల్‌లో 1,22,088, హనుమకొండలో 82,155, మహబూబాబాద్‌లో 81,146, ములుగులో 26,112, భూపాలపల్లిలో 89,800, జనగామలో 1,25,426 ఎకరాల్లో పత్తి పంట సాగు చేసినట్లు అధికారులు గుర్తించారు. ఆరు జిల్లాల్లో ఈ ఏడాది రైతులు 5,26,727 ఎకరాల్లో సాగుచేసిన పత్తి పంట నుంచి 4,21,382 టన్నుల దిగుబడి వచ్చే అవకాశం ఉందని అంచనా వేశారు. జిల్లావారీగా వరంగల్‌లో 97,670, హనుమకొండలో 65,724, మహబూబాబాద్‌లో 64,917, ములుగులో 20,890, భూపాలపల్లిలో 71,840, జనగామలో 1,00,341 టన్నుల పత్తి దిగుబడులు రావొచ్చని ప్రభుత్వానికి పంపిన నివేదికలో తెలిపారు. ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధర క్వింటాల్ మీడియం స్టేపుల్ పత్తి రూ.6,620, లాంగ్ స్టేపుల్ పత్తి రూ.7,020. సీసీఐ ద్వారా మద్దతు ధరతో రైతుల నుంచి పత్తిని కొనేందుకు అధికారులు నోటిఫైడ్ జిన్నింగ్ మిల్లుల్లో పత్తి కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేశారు.

వరి పంట

వరి పంట సాగుబీ అంతే

ఉమ్మడి జిల్లాలో గతేడాది వానకాలం కంటే ఈ ఏడాది వానకాలం వరి పంట సాగు విస్తీర్ణం సుమారు 12వేల ఎకరాలు తగ్గింది. గతేడాది వానకాలం రైతులు 9,12,227 ఎకరాల్లో వరి సాగు చేశారు. జిల్లాలవారీగా వరంగల్‌లో 1,35,254, హనుమకొండలో 1,45,900, మహబూబాబాద్‌లో 2,12,700, ములుగులో 1,00,298, భూపాలపల్లిలో 1,04,828, జనగామలో 2,13,247 ఎకరాల విస్తీర్ణం ఉంది. ఈ ఏడాది వానకాలం వరి పంట సాగు విస్తీర్ణం 9,00,215 ఎకరాలకు తగ్గింది. జిల్లావారీగా వరంగల్‌లో 1,34,354, హనుమకొండలో 1,46,020, మహబూబాబాద్‌లో 2,10,270, ములుగులో 84,910, భూపాలపల్లిలో 1,10,900, జనగామలో 2,13,761 ఎకరాల్లో రైతులు వరి పంట సాగు చేశారు. ముఖ్యంగా ములుగు జిల్లాలో సుమారు పదిహేను వేల ఎకరాలకుపైగా విస్తీర్ణం పడిపోయింది. ఆ తర్వాత వరంగల్, మహబూబాబాద్ జిల్లాల్లో వరి పంట సాగు విస్తీర్ణం స్వల్పంగా తగ్గింది. భూపాలపల్లి, హనుమకొండ, జనగామ జిల్లాల్లో కొంత విస్తీర్ణం పెరిగింది. గతేడాది వానకాలం కంటే ఈ ఏడాది వానకాలం కొంత తగ్గినా ఉమ్మడి జిల్లాలో సాగు విస్తీర్ణం సాధారణం కంటే దాటింది. సాధారణ విస్తీర్ణం 7,07,757 ఎకరాలు. ఇందులో జిల్లావారీగా వరంగల్‌లో 1,06,749, హనుమకొండలో 1,12,396, మహబూబాబాద్‌లో 1,59,408, ములుగులో 98,861, భూపాలపల్లిలో 93,298, జనగామలో 1,37,045 ఎకరాలు ఉంది. ప్రతి జిల్లాలో ఏటా రైతులు సాధారణం కంటే ఎక్కువ విస్తీర్ణంలో వరి సాగు చేస్తున్నారు. ఈ ఏడాది వానకాలం ఉమ్మడి జిల్లాలో రైతులు సాగు చేసిన వరి నుంచి 18,00,430 టన్నుల ధాన్యం దిగుబడులు వస్తాయని అధికారులు అంచనా వేశారు. జిల్లావారీగా వరంగల్‌లో 2,68,708, హనుమకొండలో 2,92,040, మహబూబాబాద్‌లో 4,20,540, ములుగులో 1,69,820, భూపాలపల్లిలో 2,21,800, జనగామలో 4,27,522 టన్నులు వచ్చే అవకాశం ఉందని ధాన్యం కొనుగోళ్లకు ప్రణాళిక రూపొందించారు.

మక్కజొన్న సాధారణం లోపే

మక్కజొన్న పంట ఉమ్మడి జిల్లాలో సాధారణ విస్తీర్ణం కూడా దాటడం లేదు. గతేడాది వానకాలం, ఈ ఏడాది వానకాలం సాధారణం కంటే తక్కువ విస్తీర్ణంలో రైతులు మక్కజొన్న సాగు చేశారు. మక్కజొన్న సాధారణ విస్తీర్ణం 83,765 ఎకరాలు. ఇందులో జిల్లాలవారీగా వరంగల్‌లో 23,371, హనుమకొండలో 12,745, మహబూబాబాద్‌లో 35,032, ములుగులో 2,144, భూపాలపల్లిలో 965, జనగామలో 9,508 ఎకరాలుగా ఉంది. గతేడాది వానకాలం ఉమ్మడి జిల్లాలోని రైతులు 75,336 ఎకరాల్లో మక్కజొన్న పంట సాగు చేశారు. జిల్లావారీగా పరిశీలిస్తే వరంగల్‌లో 12,462, హనుమకొండలో 3,872, మహబూబాబాద్‌లో 54,080, ములుగులో 1,119, భూపాలపల్లిలో 280, జనగామలో 3,523 ఎకరాల్లో మక్కజొన్న పంట సాగులోకి వచ్చింది. ఈ ఏడాది వానకాలం 64,768 ఎకరాల్లో రైతులు మక్కజొన్న వేశారు. జిల్లాలవారీగా చూస్తే వరంగల్‌లో 5,207, హనుమకొండలో 5,226, మహబూబాబాద్‌లో 50,211, ములుగులో 1,204, భూపాలపల్లిలో 95, జనగామలో 2,825 ఎకరాల్లో మక్కజొన్న సాగులోకి వచ్చినట్లు అధికారులు గుర్తించారు. ఈ పంట ద్వారా 95,856 టన్నుల దిగుబడి వస్తుందని అంచనా వేశారు. వరంగల్‌లో 7,706, హనుమకొండలో 7,734, మహబూబాబాద్‌లో 74,312, ములుగులో 1,782, భూపాలపల్లిలో 141, జనగామలో 4,181 టన్నుల మక్కజొన్న దిగుబడి రావొచ్చని తెలిపారు.

క్రైస్తవులకు క్రిస్మస్ గిఫ్ట్‌ప్యాక్‌లు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే కడియం శ్రీహరి

సుస్థిర ప్రభుత్వాలున్న చోటే అభివృద్ధి

- స్టేషన్‌ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి
- క్రైస్తవులకు గిఫ్ట్ ప్యాకెట్లు పంపిణీ

స్టేషన్ ఘన్‌పూర్, డిసెంబర్ 23 : శాంతి, సామరస్యంతోపాటు సుస్థిర ప్రభుత్వాలున్న చోటే అభివృద్ధి జరుగుతుందని స్టేషన్‌ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి అన్నారు. శనివారం మండలంలోని శివునిపల్లి కేఆర్ గార్డెన్‌లో మండల ప్రత్యేకాధికారి, ఆర్డీవో వాసం రామ్మూర్తి అధ్యక్షతన నిర్వహించిన నియోజకవర్గ స్థాయి సమావేశంలో క్రైస్తవులకు గిఫ్ట్ ప్యాక్‌లను శ్రీహరి పంపిణీ చేశారు. ముందుగా ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించి, క్రిస్మస్ కేక్‌ను కట్ చేశారు. అనంతరం కడియం మాట్లాడుతూ దేశంలో మత విద్వేషాలు లేకుండా, శాంతి, సామరస్యం ఉన్నప్పుడే అభివృద్ధి పనులు జరుగుతాయన్నారు. బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ పాలనలో రాష్ట్రంలో అన్ని మతాలను సమానంగా గౌరవించారని గుర్తు చేశారు.

బతుకమ్మ, రంజాన్, క్రిస్మస్ పండుగల సందర్భంగా ఆయా మతాల ప్రజలకు సర్కారు కానుకలను పంపిణీ చేసిందన్నారు. ప్రతి నియోజకవర్గానికి సర్కారు వెయ్యి గిఫ్ట్ ప్యాక్‌లు కేటాయించగా, అత్యధిక క్రైస్తవులున్న స్టేషన్‌ఘన్‌పూర్ నియోజకవర్గానికి మూడు వేల గిఫ్ట్ ప్యాకెట్లను అందిస్తున్నామని శ్రీహరి తెలిపారు. రాజకీయాలకు అతీతంగా నిజమైన లబ్ధిదారులకు వీటిని అందించాలని ఆయన పాస్టర్లకు సూచించారు. క్రైస్తవుల్లో అనేక మంది మద్యానికి అలవాటుపడి ఆర్థికంగా నిలదొక్కుకోలేకపోతున్నారని, దీని నివారణకు కృషి చేయాలని కోరారు. పిల్లలందరూ చదువుకునేలా సహకారం అందించాలన్నారు. కడియం ఫౌండేషన్ ద్వారా క్రైస్తవులకు తమవంతు సేవలందిస్తున్నట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో జడ్పీ స్టాండింగ్ కమిటీ చైర్మన్ మారపాక రవి, ఎంపీపీ కందుల రేఖాగట్టయ్య, జఫర్‌గఢ్ జడ్పీటీసీ ఇల్లందుల బేబీశ్రీనివాస్, బీఆర్ఎస్ జిల్లా నాయకుడు నరేందర్ రెడ్డి, తహసీల్దార్ డీ వెంకటేశ్వర్లు, ఇన్‌చార్జి ఎంపీడీవో శ్రీధర్ స్వామి, ఆర్ఐ రవీందర్, ఎంపీటీసీలు బూర్ల లతాశంకర్, గుర్రం రాజు, గన్ను నర్సింహులు, రజాక్ యాదవ్, జఫర్‌గఢ్ సొసైటీ చైర్మన్ తీగల కరుణాకర్, క్రిస్మస్ వేడుకల ఆర్గనైజింగ్ కమిటీ అధ్యక్షుడు ఫాస్టర్ మారపాక బాలస్వామి, ఫాదర్ అగస్టీన్ రెడ్డి, ఫాదర్ దేవవరం, కే థామస్, నంగనూరి టెక్నో, కోర్నెల్, జయరాజు, తిమ్మోతి, నిర్మల్‌జ్యోతి బాబు తదితరులు పాల్గొన్నారు.

ప్రజలు సుఖసంతోషాలతో ఉండాలి

- ఆలయాల అభివృద్ధికి కృషి చేస్తా
- రాష్ట్ర అటవీ, పర్యావరణ, దేవాదాయ శాఖల మంత్రి కొండా సురేఖ.. వేంకటేశ్వరాలయంలో పూజలు

గిర్మాజీపేట, డిసెంబర్ 23: వరంగల్ తూర్పు నియోజకవర్గ ప్రజలు ఎల్లవేళలా సుఖసంతోషాలతో ఉండాలని రాష్ట్ర అటవీ, పర్యావరణ, దేవాదాయ శాఖల మంత్రి కొండా సురేఖ అన్నారు. వైకుంఠ ఏకాదశి సందర్భంగా శనివారం ఆమె బట్టలబజార్‌లోని శ్రీబాలానగర్ వేంకటేశ్వరాలయాన్ని మాజీ మేయర్ గుండా ప్రకాశ్‌రావుతో కలిసి దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఈవో ఎలపాటి రత్నాకర్‌రెడ్డి, అర్చకులు మంత్రికి పూర్ణకుంభం స్వాగతం పలికారు.

అనంతరం ఆమె ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించగా, మంత్రిని అర్చకులు ఆశీర్వదించారు. ఈ సందర్భంగా కొండా సురేఖ మాట్లాడుతూ ఎండోమెంట్ పరిధిలో ఉన్న ఆలయాల అభివృద్ధికి తనవంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు ఆలయాల పునర్నిర్మాణాన్ని కొనసాగిస్తామన్నారు.

క్రిస్టియన్లకు కానుకలు పంపిణీ చేస్తున్న మంత్రి కొండా సురేఖ

అర్చకులు, ఫాదర్లు, ఇమామ్‌లకు వేతనాల పెంపు

పోచమ్మమైదాన్: అర్చకులు, ఫాదర్లు, ఇమామ్‌లకు త్వరలో గౌరవ వేతనాలు పెంచుతామని మంత్రి కొండా సురేఖ అన్నారు. వరంగల్ ఎల్‌బీనగర్‌లోని అబ్బాస్ ఫంక్షన్ హాల్‌లో నిర్వహించిన క్రిస్మస్ వేడుకల్లో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొని కేక్ కట్ చేసి, క్రిస్మస్ కానుకలు పంపిణీ చేసి ప్రార్థనల్లో పాల్గొన్నారు. తన తొలి ప్రాధాన్యం తూర్పు నియోజకవర్గ అభివృద్ధికి ఇస్తానన్నారు. కార్యక్రమంలో వరంగల్ కలెక్టర్ ప్రావీణ్య, కార్పొరేటర్లు గుండేటి నరేంద్రకుమార్, పద్మ, పల్లం పద్మ, రవి, గుండు చందన, నోడల్ అధికారి కృష్ణారెడ్డి పాల్గొన్నారు.

జనగామలో కాంగ్రెస్ జులుం..

- ఓటమి పాలైన అభ్యర్థితో క్రిస్మస్ కానుకలు పంపిణీ చేయించిన వైనం
- వత్తాసు పలికిన అధికారులు
- ప్రొటోకాల్ 'ఉల్లంఘన'పై ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి ఆగ్రహం
- తనకు ఆహ్వానం పంపించి కొమ్మూరితో మరోచోట ఎలా పంపిణీ చేస్తారని మండిపాటు
- ఆదేశాలుంటే చూపించాలని కలెక్టర్‌తో వాగ్వాదం
- బాధ్యులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్

జనగామ చౌరస్తా, డిసెంబర్ 23 : క్రిస్మస్ పర్వదినం సందర్భంగా ప్రతిఏటా నిరుపేదలకు బట్టలు పంపిణీ చేయాలని కేసీఆర్ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని కొత్తగా వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తూనే మరో వైపు అధికారులను అడ్డుపెట్టుకొని ఓడిపోయిన ఆ పార్టీ జనగామ ఎమ్మెల్యే అభ్యర్థి కొమ్మూరి ప్రతాప్‌రెడ్డితో అధికారిక కార్యక్రమాలను కొనసాగిస్తూ ప్రొటోకాల్‌ను ఉల్లంఘించింది. శనివారం ఉదయం 11 గంటలకు జనగామ నియోజకవర్గ కేంద్రంలోని వడ్లకొండ రోడ్డులో ఉన్న ఎస్సార్ గార్డెన్‌లో క్రిస్మస్ దుస్తుల పంపిణీ ఉందని మూడు రోజుల క్రితం ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డికి సంబంధిత జిల్లా అధికారులు ఆహ్వానం అందించారు. ఆ తర్వాత స్థానిక గాయత్రి గార్డెన్‌లో కార్యక్రమం ఉంటుందని, ముఖ్య అతిథిగా మంత్రి కొండా సురేఖ హాజరవుతారని ఎమ్మెల్యే పల్లాకు సమాచారం ఇచ్చారు. ప్రభుత్వ అధికారిక కార్యక్రమం పేరిట ఫ్లెక్సీని ఏర్పాటు చేశారు. అందులో సీఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రులు కొండా సురేఖ, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, పొన్నం ప్రభాకర్‌తో పాటు కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి ఫొటోలు మాత్రమే పెట్టి, స్థానిక ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి ఫొటోను విస్మరించారు. ఎమ్మెల్యే పల్లా లేకుండానే కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి చేతుల మీదుగా జిల్లా మైనార్టీ సంక్షేమశాఖ అధికారి ఇస్మాయిల్, డీఆర్డీవో రాంరెడ్డి, ఆర్డీవో మురళీకృష్ణ, తహసీల్దార్ మహిపాల్‌రెడ్డి తదితరులు కొద్దిమంది లబ్ధిదారులకు దుస్తులు పంపిణీ చేసి వెళ్లిపోయారు. దీనికి నిరసనగా ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి స్థానిక ప్రజాప్రతినిధులతో కలిసి కలెక్టరేట్‌లో జిల్లా కలెక్టర్ శివలింగయ్య ఎదుట నిరసన చేపట్టారు. ఆహ్వానం తనకు పంపించి ఏ హోదాలో కొమ్మూరితో మరోచోట కార్యక్రమం నిర్వహిస్తారని ఆగ్రహం వ్యక్తం చేశారు. అలా చేయమని మీకు స్పష్టమైన ఆదేశాలు ఉంటే తమకు చూపించాలని కలెక్టర్‌ను చాంబర్‌లోనే నిలదీశారు. ఎమ్మెల్యే పల్లాకు, కలెక్టర్‌కు మధ్య స్వల్ప వాగ్వాదం జరిగింది. బీఆర్ఎస్ ప్రజాప్రతినిధులు, నాయకులు కలెక్టర్ చాంబర్ నుంచి బయటకు వెళ్లాలంటూ ఏసీపీ దేవేందర్‌రెడ్డి అనడంతో ఎమ్మెల్యే పల్లా వారించారు. మహాలక్ష్మీ పథకం, ఆరోగ్యశ్రీ రూ.10 లక్షలకు పెంపు కార్యక్రమంతో పాటు క్రిస్మస్ దుస్తుల పంపిణీలో ఇప్పటి వరకు రెండు సార్లు ప్రొటోకాల్ ఉల్లంఘించిన అధికారులపై వెంటనే చర్యలు తీసుకోవాలని కలెక్టర్ శివలింగయ్యకు ఎమ్మెల్యే పల్లా రాతపూర్వక ఫిర్యాదు చేశారు. అనంతరం పల్లా మీడియాతో మాట్లాడుతూ క్రిస్మస్ సందర్భంగా ప్రభుత్వం పేద ప్రజలకు మాత్రమే దుస్తులు పంపిణీ చేయాలన్నారు. ఎన్నికల్లో ఓడిన కాంగ్రెస్ అభ్యర్థి కొమ్మూరికి అధికారులు వత్తాసు పలికి మంత్రి కొండా సురేఖ వస్తున్నారని తనకు మాయ మాటలు చెప్పారని తెలిపారు. ప్రొటోకాల్ పాటించకుండా పేదలకు అందాల్సిన 950 గిఫ్ట్ ప్యాకెట్లను అధికారులతో కలిసి కాంగ్రెస్ నాయకులు వారి కార్యకర్తలకే పంచుకున్నారని విమర్శించారు. నాతోపాటు కలెక్టరేట్‌కు వచ్చిన వారంతా కార్యకర్తలు కాదు, ప్రజాప్రతినిధులు. వీరందరికీ అధికారులు ఆహ్వానం అందిస్తేనే వచ్చారు, కానీ మేమెవరం లేకుండానే కార్యక్రమం ముగించారని ఆవేదన వ్యక్తం చేశారు. కాంగ్రెస్ వాళ్లు పేదలకు కానుకలు ఇవ్వాలనిపిస్తే వారి పార్టీ కార్యాలయం వద్ద ఇచ్చుకోవాలని పేర్కొన్నారు. కలెక్టర్ శివలింగయ్యతో ఆవేదన చెప్పుకునే ప్రయత్నం చేస్తుంటే పోలీసులు జులుం ప్రదర్శించారన్నారు. పోలీసులు దొంగలకు సద్దులు మోయొద్దని పల్లా హితవు పలికారు. బీఆర్ఎస్ ఉద్యమ పార్టీ అని, ఎవరికీ భయపడమన్నారు. ప్రొటోకాల్ ఉల్లంఘించిన అధికారులపై అసెంబ్లీ స్పీకర్, చీఫ్ సెక్రెటరీకి ఫిర్యాదు చేస్తామని పల్లా తెలిపారు. అనంతరం వడ్లకొండ రోడ్డు మార్గంలోని ఎస్సార్ ఫంక్షన్‌హాల్‌లో కలెక్టర్ శివలింగయ్యతో పాటు ఎమ్మెల్యే పల్లా, ఇతర ప్రజాప్రతినిధులు కలిసి క్రిస్మస్ కానుకల పంపిణీలో పాల్గొన్నారు.

ప్రొటోకాల్ ఉల్లంఘనపై కలెక్టర్ శివలింగయ్యకు రాతపూర్వక ఫిర్యాదు చేస్తున్న ఎమ్మెల్యే పల్లా

రాజకీయం నాతో చేయండి..

- భగవంతుడిపై కాదు
- కలెక్టర్, అధికారులకు తెలిసే ఆలయ పనులు
- రాత్రికి రాత్రే నిర్మించింది కాదు
- మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి

మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి

జయశంకర్ భూపాలపల్లి, డిసెంబర్ 23 (నమస్తే తెలంగాణ) : గెలిచిన ఎమ్మెల్యే రాజకీయం చేసేది భగవంతుడిపై కాదని, తనపై చేస్తే దేనినైనా ఎదుర్కోవడానికి సిద్ధంగా ఉన్నానని మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి అన్నారు. శనివారం మంజూర్‌నగర్‌లో నిర్మించిన వేంకటేశ్వరస్వామి ఆలయం, ఆవరణలో పూజారులకు నిర్మించిన వసతి, వర్కర్ల గృహాలు, స్టోర్ రూం, భక్తులు సేద తీరడానికి నిర్మించిన హాల్, ఆలయం వెనుక నిర్మించబోయే కల్యాణ మండపం ప్రదేశం, ఆదాయం సమకూర్చి పెట్టే షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణాలను ఆయన విలేకరులకు చూపించారు. అనంతరం బీఆర్ఎస్ కార్యాలయంలో మాట్లాడారు. ఆలయానికి సంబంధించిన ప్లాన్ అధికారులందరికీ తెలుసని, శంకుస్థాపన, విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమాల్లో కలెక్టర్‌తో పాటు రెవెన్యూ అధికారులందరూ పాల్గొన్నారని తెలిపారు. నిర్మాణాలన్నీ అధికారులకు తెలిసే జరిగాయని, తానేమీ దాచలేదన్నారు. ఏడాది తర్వాత అక్రమ నిర్మాణాలని, అనుమతులు లేవని, స్థలానికి సంబంధించి కేసు కోర్టులో ఉందని చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు. ఆలయ నిర్వహణకు నెలకు రూ. 2 లక్షల వరకు ఖర్చు అవుతున్నదని, షాపింగ్ కాంప్లెక్స్ ద్వారా ఆదాయం సమకూరుతుందన్నారు. పేదలు పెళ్లిళ్లు చేసుకునేందుకు ఆలయం వెనుక కల్యాణ మండపం సైతం నిర్మిస్తున్నట్లు చెప్పారు. కాంగ్రెస్ ఎమ్మెల్యే గెలిచిందే అదునుగా వ్యక్తిగత కుట్ర రాజకీయాలకు తెరలేపుతున్నారన్నారు. 100 రోజుల అనంతరం తాము కూడా ప్రతిపక్ష పాత్రను బలంగానే పోషిస్తామన్నారు. ఇప్పటికైనా ఆలయంపై కుట్రలు ఆపాలని వెంకటరమణారెడ్డి సూచించారు. సమావేశంలో మున్సిపల్ చైర్పర్సన్ సెగ్గం వెంకటరాణి, బీఆర్ఎస్ అర్బన్ అధ్యక్షుడు కటకం జనార్దన్, జడ్పీటీసీ జోరుక సదయ్య, పీఏసీఎస్ చైర్మన్ మేకల సంపత్ యాదవ్, కౌన్సిలర్లు నూనె రాజు, ఎడ్ల మౌనిక, ఆకుదారి మమత, జక్కం రవికుమార్, నాయకులు సిద్ధు, నాగుల దేవేందర్, మోతె రాజు, మల్లేశ్ యాదవ్, అల్లూరి కుమార్, గురిజాల శ్రీనివాస్, కరాటే శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

పీవీ ఆశయాలు కొనసాగించాలి

- సిద్దిపేట-ఎల్కతుర్తి నేషనల్ హైవేకు పీవీ పేరు
- రవాణా, బీసీ సంక్షేమశాఖల మంత్రి పొన్నం ప్రభాకర్

భీమదేవరపల్లి : మాట్లాడుతున్న మంత్రి పొన్నం ప్రభాకర్

భీమదేవరపల్లి, డిసెంబర్ 23 : భారత మాజీ ప్రధాని పీవీ నరసింహారావు ఆశయాలను ప్రతి ఒక్కరూ కొనసాగించాలని రవాణా, బీసీ సంక్షేమ శాఖల మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. శనివారం వంగరలో పీవీ 19వ వర్ధంతి కార్యక్రమం జరిగింది. జడ్పీ చైర్మన్ మారపల్లి సుధీర్‌కుమార్, మాజీ ఎమ్మెల్యేలు అల్లిరెడ్డి ప్రవీణ్‌రెడ్డి, చాడ వెంకటరెడ్డితో కలిసి పీవీ విగ్రహానికి పూలమాల వేసి మంత్రి నివాళులర్పించారు. అనంతరం మాట్లాడుతూ.. పీవీ గ్రామీణ ప్రాంతాలను అభివృద్ధి చేశారని గుర్తు చేశారు. నూతన ఆర్థిక సంస్కరణలు, నవోదయ పాఠశాలలను ప్రవేశపెట్టి విద్యాభివృద్ధికి దోహదపడ్డారని వివరించారు. ఉమ్మడి రాష్ట్ర సీఎంగా ఉన్న సమయంలో తన పదవికి ఇబ్బందులు తలెత్తుతాయని తెలిసినా భూ సంస్కరణలు ప్రవేశపెట్టారని పేర్కొన్నారు. ఎల్కతుర్తి–సిద్దిపేట హైవేకు పీవీ నామకరణం చేస్తామని ప్రకటించారు. నిధుల కొరత ఉన్నప్పటికీ వంగరలో జరుగుతున్న అభివృద్ధి కార్యక్రమాలను రాజకీయాలకు అతీతంగా పూర్తి చేస్తానని తెలిపారు. అనంతరం మ్యూజియంగా మార్చిన పీవీ ఇంటిని సందర్శించారు. కార్యక్రమంలో ఎంపీపీ జక్కుల అనిత, సర్పంచ్ ఆలూరి రజిత, జేసీ మహేందర్‌జీ, ఆర్డీవో రమేశ్, ఎంపీవో నాగరాజు, ఏసీపీ దేవిడ్‌రాజు, రెడ్‌క్రాస్ సొసైటీ వైస్ చైర్మన్ వెంకటనారాయణ పాల్గొన్నారు.